నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 25, 2024 | www.navatelangana.com

అధికారుల సూచనతో పంటలను కాపాడుకోవాలి

- వరి పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోధన్

సాలూర మండల శివారులో మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వరి పంటలను పరిశీలించారు. వరికి సోకిన వైరస్ నివారణకు శాస్త్రవేత్తల సలహాల మేరకు మందులు వాడి పంటలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వరి పంటకు సోకిన తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, బోధన్ తహశీల్దార్ విట్టల్, సాలురా ఎమ్మార్వో శశి భూషణ్, మానాల మోహన్ రెడ్డి ,గంగా శంకర్, నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, దాము, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, అల్లే రమేష్, మందర్న రవి, గణపతిరెడ్డి, సాలంపాడ్ మాజీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

టీయూ లైబ్రరీలో మళ్లీ పాము ప్రత్యక్షం

ఆందోళనలో విద్యార్థులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లోని లైబ్రరీ లో సోమవారం రాత్రి పాము కలకలం రేపింది. చదువుకుంటున్న సమయంలో రాత్రి పూట పాము ప్రత్యక్షం కావడంతో విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. గత రెండు రోజుల క్రితం సిఎస్ బిల్డింగ్‌లో జరిగిన ఘటన మరవ ముందే మళ్లీ పాము రూంలో రావడం, అధికారులకు చెప్పిన సరిగ్గా పటించుకోక పోవడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం చేశారు. ఎక్కడి నుండి ఏ విష స్వర్పాలు వస్తున్నాయో అంతుబట్టడం లేదని ఇకనైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి ఘటనలు పునావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను విద్యార్థులు వెడుకుంటున్నారు.

ఎస్సారెస్పీ 7 గేట్లు ఎత్తివేత

- ఎగువప్రాంతాల నుంచి 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కాలువలతో పాటు దిగువకు గోదావరి జలాలు విడుదల
- నిజాంసాగర్ నుంచి రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల





నవతెలంగాణ-మెండోర/నిజాంసాగర్

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రధాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుండి ప్రస్తుతం 45,858 క్యూసెక్కుల వరదనీరు చేరుతుందని ప్రాజెక్టు ఏఈఈ రవి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నిటిమట్టానికి చేరుకోవడంతో ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం 7 ప్రధాన గేట్లు తెరిచి 21,868 క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. అదే విధంగా ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల జలాలు గోదావరి నదిలోకి వదులుతూ వరద కాలువ ద్వారా 15,000, కాకతీయ ప్రధాన కాలువకు 6800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కుల జలాలు వదులుతూ మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 45,858 క్యూసెక్కుల నీటిని అంతేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 85.05 టిఎంసిలు కాగా ప్రస్తుతం అదే స్థాయిలో నీరు నిల్వ ఉంది.

నిజాంసాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈఈ శివ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి 11,570 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, రెండు గేట్ల ద్వారా 9570 క్యూసెక్కులు, ప్రధాన కాలువకు 2005 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతానికి ప్రాజెక్టులో 17.715 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరదను అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ సిబ్బందికి

బకాయి వేతనాలు చెల్లించాలి

- లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పంచాయతీ సిబ్బంది బకాయిలు, వేతనాలు తక్షణమే చెల్లించాలని, 2వ పిఆర్సి వర్తింపచేయాలని, వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికులందరికీ రూ.10 లక్షల ఇన్సూరెన్సు బీమా పథకాన్ని తక్షణమే నమోదు చేయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు మూడు నెలల నుండి 9 నెలలు వరకు సిబ్బంది వేతనాలను ప్రభుత్వం చెల్లించకపోవడం సరైంది కాదని కార్మికులు ఏం తిని బతకాలి అని ప్రశ్నించారు.

'గత ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రతిఘటిస్తూ పంచాయతీ కార్మికులందరూ కాంగ్రెస్ పార్టీ గెలుపును కాంక్షిస్తూ ఓట్లు వేసి గెలిపించారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నప్పటికీ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరం పట్ల, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, పిఆర్సిలో పంచాయతీ కార్మికుల గుర్తింపు, కనీస వేతనం రూ.26,000/ల అమలు లాంటి డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు తీసుకెళ్ళినప్పటికీ పరిష్కరించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఎదురు చూసిన కార్మికుల ఆశలు నిరాశలైనాయి. పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులందరి పేర్లతో రూ.10 లక్షల ఇన్సూరెన్స్ బీమా పథకాన్ని చేయించాలని, అట్టి దానిని ఏదైనా పోస్టాఫీస్ లేదా బ్యాంక్ నందు చేయించాలని ఈ ప్రీమియమ్ మొత్తాన్ని సంబంధిత పంచాయితీ నుండి చెల్లించాలని, కార్మికుల పేరుతో చేయించిన ప్రీమి యమ్ వివరాలను పంచాయితీ రాజ్ శాఖకు అందిం చాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయితీ కార్మికుల తరుపున ప్రత్యేకమైన ధన్యవా దాలు తెలియజేస్తున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులందరి పేర్లతో బీమా పథకాన్ని చేయించాలని, సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ స్వచ్ఛత సేవా పేరుతో ఇచ్చిన పారిశుద్ధ్య కార్యక్రమాల జయప్రదానికి పంచాయితీ సిబ్బంది పూర్తిగా సహకరిస్తామని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాం. ప్రభుత్వ ఉత్తర్వులకనుగుణంగా పేదలైన పంచాయితీ కార్మికులందరికీ బీమా పథకాన్ని తక్షణమే అమలు చేయించాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని, వివిధ మండలాల్లోని పంచాయితీలలో బకాయి వేతనాలు తక్షణమే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని లేనియెడల పోరాటాలను ఉధృతం చేస్తామని' హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ గణేష్, వంశీ రమేష్ హకీమ్ అనురాధ విజయ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల నమోదుకు ఈ నెల 30 నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చు
- డిసెంబర్ 30న ఓటరు తుది జాబితా : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన అర్హత కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఈ నెల (సెప్టెంబర్) 30 నుండి దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం సూచించారు. పై నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ స్థానంతో పాటు, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎలక్షన్ కమిషన్ అర్హత కలిగిన ఓటర్లకు పేర్ల నమోదు కోసం అవకాశం కల్పిస్తూ ఈ నెల 30న పబ్లిక్ నోటీసును జారీ చేయనుందని తెలిపారు. అక్టోబర్ 16, 25 వ తేదీలలో రెండు పర్యాయాలు పత్రికాముఖంగా కూడా ప్రకటనలు జారీ చేస్తారని అన్నారు. 2024 నవంబర్ 06వ తేదీ వరకు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏఈఆర్ఓ కార్యాలయాల్లో నేరుగా కూడా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గడువులోపు దాఖలైన దరఖాస్తులను పరిశీలించిన మీదట నవంబర్ 23 న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 23 నుండి డిసెంబర్ 09 వ తేదీ వరకు తెలియజేయవచ్చని అన్నారు. 2024 డిసెంబర్ 30 న నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను వెలువరించనున్నట్టు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు జాబితాలో పేర్ల నమోదు కోసం ఈ నెల 30 నుండి 2024 నవంబర్ 06 వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లు ఫారం-18 లో, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు ఫారం-19 లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. కరీంనగర్ డీఆర్ఓ ఈ ఎన్నికలకు ఈఆర్ఓగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

పేదల శ్రేయస్సుకు జీవితం త్యాగం

- కొరటాల సత్యనారాయణ శతజయంతిలో సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శతజయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూస్వామ్య కుటుంబంలో పుట్టి విద్యార్థి దశలోనే ఉద్యమాలు నడిపిన నేత కొరటాల సత్యన్నారాయణ అని అన్నారు. ఆనాటి విద్యార్థి సంఘం జిల్లా నాయకులైన మాకినేని బస్వ పున్నయ్య, మోటూరి హనుమంతరావు, లావు బాలగంగాధర్ రావుల సాన్నిహిత్యంతో కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై పేద ప్రజల శ్రేయస్సుకై జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవి అని కొనియాడారు. ఆయన రేపల్లె డివిజన్ పార్టీ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజానాయకులు అని కొనియాడారు. 'రేపల్లె ఏరియాలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని కృషి చేశారు. చేనేత కార్మికులు కొరటాలను తమ వాడిగా చెప్పుకున్నారంటే వారి సమస్యలపై ఆయన చేసిన కృషి అసమానమైనదని గుర్తు చేశారు. 'నాగార్జునసాగర్ నిర్మాణానికై కమ్యూనిస్టు పార్టీలోని ఇతర నాయకులతో కలిసి అనేక పోరాటాలు నిర్వహించారు. రైతాంగ పోరాటాల ఉధృతిని తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ఆయన గణనీయమైన కృషిచేశారు. 1964 లోనూ, 1968 లోనూ కమ్యూనిస్టు ఉద్యమాలు చీలికలు ఏర్పడినప్పుడు జిల్లాలో సీపీఐ(ఎం) నిలబెట్టేందుకై సైద్ధాంతిక పోరాటం నిర్వహించారు. సమస్యలను అధ్యయనం చేయడంలో ఆయన శైలే ప్రత్యేకమైనది. తాను కేన్సర్‌తో మరణిస్తానని తెలిసి కూడా కొంచెమన్నా విచారించక తనను పరామర్శించటానికి వచ్చిన కార్యకర్తలు, నాయకులకు ఉద్యమాల గురించి ఉమ్మడి రాష్ట్రమంతా పార్టీ విస్తరణ గురించి సూచనలు ఇస్తుండే వారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రమేష్ బాబు, కార్యదర్శి వర్గ సభ్యులు, నూర్జహాన్, శంకర్ గౌడ్, మరియు జిల్లా కమిటీ సభ్యులు నన్నేసాబ్, నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ఈదురు గాలుల వర్షం నేలకొరిగిన వరి



నవతెలంగాణ-లింగంపేట్


లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలుల వర్షం కారణంగా కోతకొచ్చిన వరి పంట నేలకొరిగింది. భవానిపేట్, జల్దిపల్లి, రాంపూర్, పోల్కంపేట్, కన్నాపూర్, రాంపల్లి గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురవడంతో చేతకొచ్చి కోతకొచ్చిన వరి పంట నేలకొరిగినాయి. సుమారు 150 ఎకరాలకు పైగా నేలకొరిగినట్టు సమాచారం. రెండు రోజుల క్రితం ఈదురుగాళ్ల వర్షం కారణంగా మండలంలో 45 ఎకరాలు వారి పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలాద రూపాయల పెట్టుబడి పెట్టి అప్పులు చేసి వరి పంటలు సాగు చేస్తే కోతకచ్చే సమయంలోనే నేలకొరవడంతో రైతులు అందంగా చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపోయినటువంటి నేలకొరిగిన వరి పంటలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.

రోగులకు భద్రత ప్రశ్నార్థకం

- పగిలిన ఆస్పత్రి కిటికీ అద్దం.. విషసర్పాలు లోపలికి వచ్చే అవకాశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెనుక వైపు గల కిటికీ అద్దం చాలా రోజుల క్రితం పగిలినా, అందులో పనిచేసే వైద్యులు పట్టించుకోవడం లేదు. వైద్యశాల ఊరికి దూరంగా ఉండి, ఆసుపత్రి వెనుక వైపు వ్యవసాయ క్షేత్రాలు ఉండ డంతో చుట్టూ పక్కల విష సర్పాలు సంచరించే అవకాశం ఉంది. ఏ సమయం లోనైనా వెనుకవైపు నుండి ఆసుపత్రిలోకి ప్రవేశించి, రోగులకు గాని, అందులో పనిచేసే వైద్యులకు, సిబ్బందికి కాటు వేస్తే, వైద్యం దేవుడెరుగు ప్రాణం పోయే అవకాశం ఉంది.



పగిలిన కిటికి అద్దం

విరుగుడు మందుల కొరత

ఇదిలా ఉంటే పాము కాటు, కుక్కకాటు, కోతి కరిస్తే విరుగుడు కోసం మందును అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నా, మందును అందుబాటులో ఉంచడం లేదు. విరుగుడు మందు ఎందుకు లేదు అని పలుమార్లు సాధారణ సర్వసభ్య సమావేశంలో విలేకరులు, నాయకులు వైద్యులను అడిగితే ఏదో ఒక సాకు చెపుతూ తప్పించుకుంటున్నారు. ఇకనైనా పగిలిన కిటికీ అద్దం ప్రదేశంలో కొత్త అద్దం అమర్చి, రోగులకు భద్రత కల్పించాలని, పలువురు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.

చిన్నారిపై లైంగికదాడి..?

- జీవదాన్ స్కూల్ ఎదుట ఆందోళన
- పోలీసులపై రాళ్లు రువ్విన ఆందోళనకారులు.. సీఐకి గాయాలు
- భయాందోళనకు గురైన విద్యార్థులు





గాయపడ్డ ఎస్ఐ రాజారామ్.. విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల జీవదాన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాఠశాలలో చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై అదే పాఠశాలకు చెందిన పీఈటీ నాగరాజు లైంగికదాడి చేశాడని చిన్నారి తల్లిదండ్రులతో పాటు బంధువులు పాఠశాలలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో పట్టణ పోలీసులు పీఈటీ నాగరాజు పై పోక్సో కేసు నమోదు చేశారు. ఆలస్యంగా విషయం బయట పడడంతో విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల యాజమాన్యంతో గొడవకు దిగారు. పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం ఆనోటా ఈనోటా వ్యాపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. దాంతో గొడవ పెద్దదిగా మారింది. అనంతరం విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాఠశాలకు చేరుకుని ఆందోళనకారులకు మద్దతుగా నిలిచారు. ఆందోళనలో పాల్గొని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు తరగతి గదుల్లో ఉన్న పిల్లలను బయటకు పంపడానికి ప్రయత్నించగా విద్యార్థులు భయంతో వణికిపోయారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆందోళనకారులను సముదాయించినా వినకపోవడంతో కాసేపటికి డీఎస్పీ నాగేశ్వర్ రావు అక్కడికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు లంచ్ బాక్సులు తీసుకుని పాఠశాలకు రావడంతో వారిలో ఆందోళన మొదలైంది. పాఠశాలలో జరిగిన ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థి సంఘాల ఆందోళనలో తల్లిదండ్రులు కూడా పాల్గొనడంతో పాఠశాలలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

రాళ్లు రువ్వడంతో పోలీసులకు గాయాలు

పాఠశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ ఫోర్స్ పాఠశాలకు చేరుకుంది. పాఠశాలలో ఉద్రిక్తత నేపథ్యంలో విద్యార్థులను బయటకు పంపించారు. దాంతో వారు ఆందోళనలో భాగస్వామ్యం అయ్యారు. వి వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ రూంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం

చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన కారులను పోలీసులు ఎంత సముదాయించినా వినిపించుకోలేదు. దాంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళనకారులు పోలీసుల పైకి రాళ్లు విసరడంతో కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తలకు గాయమైంది. సీఐతో పాటు పట్టణ ఎస్సై రాజారాం, లింగంపేట ఎస్సై, పలువురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దాంతో పోలీసులు ఆందోళనకారుపై లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. పరిస్థితిని పోలీసులు అదుపులోకి తెచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ సింధుశర్మలు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు.

బస్సులో నుంచి పడి విద్యార్థికి గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం కేంద్రానికి చెందిన విద్యార్థిని కావ్య మంగళవారం కళాశాలకు వెళ్తున్న తరుణంలో బస్సులో నుంచి ప్రమాదవశాత్తు దిగుతుండగా కిందపడి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తుందని కళాశాలకు వెళ్తున్న తరుణంలో లింగంపేట అంబేద్కర్ చౌరస్తాలో పిట్లం బస్సు ఎక్కినట్లు తెలిపారు. కింద ఉన్న వారి అమ్మ ను చూసి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు గాయాలైనట్లు తెలిపారు. స్థానికులు వెంటనే కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బంది

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన మాధవి రెండవ కాన్పు పురిటి నొప్పులు రావడంతో వారి కుటుంబ సభ్యులు 108 సమాచారం అందించారు. 108 వాహనం వచ్చేసరికి పురిటి నొప్పులు అధికం కావడంతో వారి ఇంటిలోనే ఈఎంటి సంజీవ్ గౌడ్ సుఖప్రసావాన్ని చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మాధవి, బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో వారిని ప్రథమ చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. 108 ఈఎంటీతో పాటు పైలట్ నయాముద్దీన్‌ను కుటుంబీకులు అభినందించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని కిసాన్ నగర్‌లో లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్‌కు చెందిన దంత వైద్యుడు డాక్టర్ నిహార్ 140 మంది విద్యార్థులకు, 50 మంది గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ భాయ్ పటేల్, చాకులింగం, పెండం జీవన్, పోతు ప్రసాద్, వంశీ రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహణ

ప్రశస్త్ యాప్‌పై శిక్షణ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త్ యాప్, ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశస్త్ యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని హెడ్మాస్టర్ లాగిన్ ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించి ఇందులో నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారి డి స్వామి తెలిపారు. విద్యార్థుల పూర్తి వివరాలను ఈ యాప్ లో పొందుపరచాలని అన్నారు. ఐఈఆర్‌పీలు జలందర్, కిషన్, ఐఈ టీచర్ రామకృష్ణ, పీఆర్‌టీయూ అధ్యక్షులు శేఖర్ మండలంలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


ఎమ్మార్వోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నవీపేట్

నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణకు మాజీ ఎంపీపీ సంగెం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇందూరు హరీష్, మాజీ ఎంపీటీసీలు నవీన్ రాజ్, సతీష్ మంగళవారం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం


కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ , వైస్ చైర్మన్ షేక్ మున్నా, కమిషనర్ రాజు, వార్డు కౌన్సిలర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మెడికల్ ఆఫీసర్స్ మానస, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్గానిక్ పద్ధతిలో పసుపు పండిస్తే మంచి ధర


మాట్లాడుతున్న ఎఫ్‌పిఓ చైర్మన్ నాగులపల్లి రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

ఆర్గానిక్ పద్ధతిలో పసుపు పండిస్తే మంచి ధర వస్తదని ఎఫ్‌పిఓ చైర్మన్ నాగులపల్లి రాజేశ్వర్ అన్నారు. ఎఫ్‌పిఓ ఆధ్వర్యంలో మంగళవారం వన్నెల్ బి రైతు వేదికలో స్పైస్ బోర్డు సభ్యులు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్పైస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేసన్ మాట్లాడుతూ ఎఫ్‌పిఓలో సభ్యులుగా ఉన్న రైతులకు పసుపు ఉడకపెట్టే మిషన్, పాలిష్ మిషన్‌లకు 90శాతం సబ్సిడీ ఉంటుందని అన్నారు. టార్పలిన్లు కూడా సబ్సిడీలో ఇస్తామన్నారు. పసుపునకు రోగాలు రాకుండా యాజమాన్య పద్ధతిలో పండిస్తే మంచి దిగుబడి వస్తదని తెలిపారు. రానున్న రోజులలో సబ్సిడీలు అన్నీ ఎఫ్‌పిఓలకే ఇస్తానన్నారు. అనంతరం బాల్కొండ ఏవో లావణ్య మాట్లాడుతూ వరికి ఏవైనా రోగాలు వస్తే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వాటి నివారణకు ఏ ఏ మందులు పిచికారీ చెయ్యాలో చెబుతామన్నారు. కార్యక్రమంలో స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజమాణిక్యం, జూనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్, ఏఈఓ నిహారిక, వైస్ చైర్మన్ తోట చిన్నయ్య,డైరెక్టర్లు అరేపల్లి నర్సయ్య, నాగపూర్ రాజేశ్వర్, గణేష్ , సీఈఓ ప్రమీల పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నాగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి చింత రాజ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పెయింటింగ్ బాగా చేసిన పిల్లలకు బహుమతులను ప్రధానం చేశారు. పెయింటింగ్‌లను పరిశీలించిన ఆయన వారిలోని కళా ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటింటికి మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలన్నారు. మరుగుదొడ్డి లేని ఇంట్లోని విద్యార్థులు మరుగుదొడ్డి ఆవశ్యకతను తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాడైన వస్తువులలో ఎక్కువ రోజుల నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రావు, ఉపాధ్యాయురాలు స్వప్న పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత కారాగార శిక్ష

- నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళ హత్య కేసులో మరో మహిళతో పాటు ఓ వ్యక్తికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అత్యాచారాలను నివారించే ప్రత్యేక న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి శ్రీనివాస్ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం జేకే తండాకు చెందిన అరుణ అనే మహిళతో ముదెల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల అంజయ్య కు వివాహేతర సంబంధం ఉందని ఆయన భార్య కాశమణి కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. అయినప్పటికీ అరుణ, అంజయ్య వివాహేతర సంబంధాన్ని కొనసాగించారు. దీంతో తన కుటుంబం ఆర్థికంగా, కుటంబపరంగా నష్టపోతోందని భావించిన కాశమణి అరుణను హత్య చేయాలని భావించి తన గ్రామానికి చెందిన సుతారి చిన్న బాలయ్య సాయం కోరింది. తనకు రూ.5వేలు ఇస్తే సహకరిస్తానని అన్నాడు. పథకం ప్రకారం 2019 ఆగస్టు 29న హత్య చేశారు. పోలీసులు నిందితులను అరెస్టు చేయగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఇద్దరికి జీవితకారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- జిల్లా శిశు సంక్షేమ అధికారిని రసూల్ బీ
- ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/కంఠేశ్వర్

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారని కష్టపడి అవకాశాలను సాధించుకోవాలని రసూల్ బీ అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 4 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాన వక్తగా నిజామాబాద్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి రసూల్‌బి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రధానంగా సామాజిక అంశంపై అవగాహన పెంచుకోవాలని, ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా విషయాన్ని అధికారులకు తెలపాలన్నారు. చిన్న పిల్లలు మహిళలపై అఘాయిత్యాలకు పాలవుతున్నారని, ఇది ఎంతకీ క్షమార్హం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలు, శిశు సంక్షేమానికి సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చేస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా సమాజంపై అవగాహన ఏర్పడిందని, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి యూనివర్సిటీ పరిధిలో చేస్తున్న కార్యకలాపాలను వివరి ంచారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: నగరంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత - ఈ - సేవ కార్యక్రమములో భాగంగా జాతీయ సేవా పథక వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ వి.జి.లక్ష్మీ 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మంగళవారం చక్రధర్ నగర్ తండాలో ట్రాఫిక్ మేనేజ్మెంట్, గర్ల్ చైల్డ్ సెఫిటీ, స్పై కెమెరా స్వచ్ఛ భారత్ అనే అంశాలపై స్కిట్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ సైదా జైనాబ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం నివారించాలని ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని వైస్ ప్రిన్సిపల్ భార్గవి సూచించారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ సి.హెచ్ సుస్మిత, బీబీఏ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శ్రావణి, జ్యోతిర్మయి, అక్షిత, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు. గ్రామపంచా యతీ సెక్రెటరీ, గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.


కంఠేశ్వర్: ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

మన పంటలతో మనమే వ్యాపారం చేసుకుందాం

- నాబ్కాన్స్ కోఆర్డినేటర్ థామస్ మోడీ
- రైతు ఉత్పత్తిదారుల సంఘం తృతీయ మహా జనసభ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో నాబార్డ్ సహకారంతో నాబ్కాన్స్ ఆధ్వర్యంలో రైతు చైతన్య, రైతు ఉత్పత్తిదారుల కంపెనీ తృతీయ మహాజనసభ నిర్వహించారు. ఈ మహాసభకు నాబ్కాన్స్ కోఆర్డినేటర్ థామస్ మోడీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రైతులంత ఏకమవుదాం.. మన పంటలతో మనమే వ్యాపారం చేసుకుందామని అన్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులంతా కలిసి నిర్మించుకున్న సంఘాన్ని నిలబెట్టుకోవాలని వారన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మండల వ్యవసాయ శాఖ అధికారి నర్సయ్య మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి తన సహాయ సహకారాలు అన్ని వేళలా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా తృతీయ మహాసభ కోల్డ్ ప్లస్ ఆయిల్, డ్రోన్ వంటి వసతులను రైతులకు ఉత్పత్తి చేసే విధంగా తీర్మానించిందని అన్నారు. రైతులే స్వయంగా కోల్డ్ ప్లస్ ఆయిల్ నిర్మించుకొని తద్వారా ఆయిల్ తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కొనదెల శ్రీనివాస్. వైస్ చైర్మన్ తీనేటి నరేష్, డైరెక్టర్లు, ఎం.నరేందర్, బాదావత్ తిరుమల, కారల్ మార్క్స్, రిక్క బాబురావు, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, సీఈవో రవిశంకర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర బాలుర బాల్ బ్యాట్మెంటన్ జట్టుకు శిక్షకునిగా శ్యామ్ నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు శిక్షకునిగా నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్‌ను నియమించారు. ఈ నెల 26 నుండి 29 తేదీ వరకు హర్యానా రాష్టం లోని రోతక్‌లో 43వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల, బాలుర బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టుకు శిక్షకునిగా నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు బీ. శ్యామ్ ను నియమించినట్లు నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్ మంగళవారం తెలిపారు.ఈసందర్భంగా జిల్లా వ్యామాఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రంజిత్, నర్సయ్య, కిషోర్ ,రాజ్ కుమార్, కిషన్ సంఘ సభ్యులు,సంయుక్త కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్వాడీలో పోషకాహార వారోత్సవాలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్ సెక్టార్ పరిధిలోని కులాస్పూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జాకీర హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన ఆహారం గురించి పోషక విలువల గురించి తెలిపారు. ఆకుకూరలు పాలు, కూరగాయలు అధిక మోతాదులో తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హనుమాన్ రాజ్, ఏఎన్ఎం లలిత అంగన్వాడీ టీచర్లు రజిత, సుమలత, సునీత, సూర్య కళ, సుజాత ఆశా వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని అమ్రాబాద్ గ్రామ పంచాయతీలో మంగళవారం ఏడవ జాతీయ పోషణ మాసం కార్యక్రమం బోర్గం సెక్టార్ అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెయ్యి రోజుల ప్రాముఖ్యత పైన దృష్టి పెట్టాలని, సూపర్ వైజరీ సప్లి మెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం, అతి తీవ్రలోప పోషణ పిల్లల ఆరోగ్యంపైన అవగాహన కల్పించారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ సీడిపివో జి నందిని, హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు సీతకుమారి, సమీనా బేగం, స్వరూప, పంచాయతీ సెక్రటరీ స్వరూప, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త యన్ రాంబాబు, ఏఎన్ఎంలు, ఆశాలు, బోర్గం సెక్టార్ అంగన్వాడీ టీచర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు,

బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల పచ్చలనడుకుడ గ్రామానికి చెందిన జాతిరి రమేష్ వాళ్ళ అన్న జాపిరి మహేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఇటీవల వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబానికి మంగళవారం రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందించగా పచ్చలనడుకడ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మృతుని కుటుంబానికి అందజేశారు.కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిషన్ కేత్ వైస్ ప్రెసిడెంట్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

26న బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపికలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

69వ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాల్ బ్యాడ్మిటన్ బాలుర బాలికల క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుబ్బ నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ సంగం జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ మంగళవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 02.01.2005తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల కామారెడ్డి జిల్లాలో జరిగే 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తికి రిపోర్టు చేయాలని తెలిపారు.

రూ.2లక్షల 75వేల ఎల్‌ఓసి చెక్కు అందజేత


ఎల్ఓసి అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోన సముందర్ గ్రామానికి చెందిన మహేష్ కు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి కృషితో రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల 75వేల ఎల్‌ఓసి చెక్కును మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న మహేష్ ఆపరేషన్‌కోసం మంజూరైన ఎల్‌ఓసి చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్దిదారుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామా భూమా రెడ్డి, జైడి శ్రీను, రమేష్ గౌడ్, లింబాద్రి, గంగాధర్, గణేష్, మండల శేఖర్, కుమ్మరి శ్రీను, హనుమండ్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఏఎల్ఎంకు గాయాలు

- పరామర్శించిన విద్యుత్ శాఖ ఎస్ఈ

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యుత్ షాక్‌తో ఏఎల్ఎంకు గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. నగరంలోని డి-8 సెక్షన్ లో ఏఎల్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న నడిపి నాగన్న మంగళవారం ఉదయం మరమ్మతులు చేయడానికి ట్రాన్స్ ఫార్మర్ పైకి ఎక్కాడు. ఏబీ స్విచ్ తెరుచుకోక పోవడంతో విద్యుత్ షాక్ తగిలి నేలపై పడిపోయాడు. ఒంటికి మంటలు అంటుకోవడంతో దగ్గరే ఉన్న లైన్‌మెన్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ డీఈఈ శ్రీనివాస్, ఏడీఈ వీరేశం బాధితునితో మాట్లాడి ఎస్ఈ కి సమాచారం ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగన్నను ఎస్ఈ రవీందర్ పరామర్శించారు. ఘటన చోటు చేసుకున్న సమయంలో అక్కడే ఉన్న లైన్ మెన్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్స కోసం బాధితుడిని వెంటనే హైదరాబాద్ ఆస్పత్రికి తరలించాలని ఆదేశించగా, డీఈఈ అంబులెన్స్ లో తరలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్‌ను సన్మానిస్తున్న మంచిప్ప గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించబడిన ముప్పగంగారెడ్డిని మంగళవారం మంచిప్ప గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకట్రామ్, దేవ శంకర్, సాయిరాం, ముత్యం రెడ్డి, రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డిని నిజామాబాద్ మాజీ ఎంపీపీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి ఆయన నివాసంలో పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ రవి, వెంకట్ రామ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

మైనార్టీల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, అర్హులైన మైనారిటీల (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్సీలు) కొరకు వివిధ రంగాలలో (ఐటి, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్‌స్ట్రక్షన్, వెటర్నరీ, డైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, హార్టీకల్చర్, టూరిజం, హాస్పిటాలిటి, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్, సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్) వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనకు (ట్రైనింగ్ పార్ట్ నర్) లుగా నియమించుటకు గవర్నమెంట్, ప్రైవేట్ వృత్తి శిక్షణ సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వృత్తి శిక్షణ సంస్థలు జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ), టాస్క్ (ఈజీఎంఎం (ఈజీఎంఎం) మెప్మా తో గుర్తింపు, అనుసంధానం అయి ఉండాలని పేర్కొన్నారు. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్‌తో గుర్తింపు పొంది ఉండాలని తెలిపారు. అర్హతఆసక్తి కలిగిన వృత్తి శిక్షణ సంస్థలు తమ దరఖాస్తులను వీసి మేనేజింగ్ డైరెక్టర్, టి.జి.ఎం.ఎఫ్.సి ఐదవ అంతస్తు, రజ్జాక్ మంజిల్, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయంలో అక్టోబర్ 4, 2024వరకు సమర్పించాలని పేర్కొన్నారు.

25న బిఎడ్ నూతన సిలబస్‌పై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ విద్యా సంవత్సరంలో తెలంగాణ యూనివర్సిటీ పరిధి లోని అనుబంధ బీఈడీ కళాశాలలో నూతన సిలబస్ ను ప్రవేశపెట్టనున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు. నూతన సిలబస్ పై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నెల 25న ప్రత్యేక అవగాహన కార్యక్రమ బ్రోచర్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో విడుదల చేశామని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్ర శేఖర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో ఉమ్మడి సిలబస్ అమలౌతుందని పేర్కొన్నారు. అనంతరం పాఠ్యాంశ ప్రణాళికపై డాక్టర్ శంకర్, డాక్టర్ వేద ప్రకాష్‌తో అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ అవగాహన సదస్సు కు అన్ని అనుబంధ బీ ఈడీ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపల్, కరెస్పాండంట్స్ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి, పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ, ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరి, వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ శంకర్, యూనివర్శిటీ బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిలు, పీఆర్‌ఓ డాక్టర్ పున్నయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు, రిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కన్నుకి దెబ్బ తగలడానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు నిజామాబాద్ నగర సిఐ నరహరి మంగళవారం తెలిపారు. గతనెల 28న రాత్రి మాధవ్ అనే వ్యక్తి గౌతమ్ నగర్ బాబు కిరణం షాప్ వద్ద ఉండగా మద్యం మత్తులో రోడ్డుపైన న్యూసెన్స్ చేస్తున్న పవన్‌ను న్యూసెన్స్ చేయవద్దు అని అన్నారు. మద్యం మత్తులో పవన్ తన చేతికి ఉన్న కడియంతో మాధవ్ కన్నుపై కొట్టగా తీవ్ర గాయమైంది. దీంతో మంగళవారం కేసు నమోదుచేసి పవన్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.

తెగులు సోకితే యూరియా వాడకం ఆపాలి

- ఏఓ వెంకటేష్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామంలో వరి పంటను రైతులతో కలిసి ఏఓ వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వరిలో దోమపోటు, బాక్టీరియాలు ఎండు ఆకు తెగులు, కంకినల్లి గమనించామన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకిన పంట కొనల నుండి కింది వరకు అంచుల వెంబడి గోధుమ వర్ణంలో ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు గమనించిన రైతులు పొలానికి యూరియా వేయడం కొన్ని రోజులు ఆపాలన్నారు. అలాగే మూరెట్ ఆఫ్ పొటాష్ 25 కేజీలు ఒక ఎకరానికి వేసుకోవాలని, పొలంలో నీరు ఒక మడిలో నుండి మరొక మడిలో వెళ్లకుండా ఆపివేయాలని సూచించారు. స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలి తెలిపారు. సుడిదోమ వల్ల పంట 50శాతం వరకు నష్టం జరిగే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో కొన్నిసార్లు పంట పూర్తిగా నష్టపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. కంకి నల్లి వల్ల గింజలు నల్లబడి పాలు పోసుకోకుండ తాలు గింజలు గా మారే అవకాశం ఉందన్నారు. ప్రొపర్గైట్ లేదా స్పైరో మెసెఫిన్ పిచికారి చేసుకోవాలని అన్నారు. ఏఓ వెంట ఏఈఓ మనోజ్ఞ , గ్రామ రైతులు ఉన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- ఆర్డీవో రాజేంద్రకుమార్

నవతెలంగాణ-సిరికొండ

ధరణి పెండింగ్ భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేంద్ర కుమార్ అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఓటర్ లిస్ట్‌లో గల సమస్యలను పరిశీలించాని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పైఅధికారులకు పంపించి స్పష్టమైన నివేదిక అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏంఆర్‌ఓ రవీందర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం దినోత్సవం

నవతెలంగాణ-సదాశివనగర్

సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్, కామారెడ్డిలోలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ బృందం ట్రాఫిక్ మేనేజ్మెంట్ మీద ఫ్లాష్ మోబ్ కార్యక్రమం చేస్తూ మర్కల్ గ్రామ ప్రజలకు అవగాహనా సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ నినాదం "నేను కాదు మీరు" కాబట్టి ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు సమాజసేవలో పునరంకితం అవ్వాలని, ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు వంటివి వచ్చినప్పుడు ఎన్ఎస్ఎస్ విద్యార్థినుల సేవలు అభినందనీయమని తెలిపారు. జాతీయ సమైక్యతకు ఎన్ఎస్ఎస్ కృషి చేస్తుందని వివరించారు. ఈ విధంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ ఆర్.ఉదయిని, డాక్టర్ శ్రావణి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి చంద్రకళ, సభ్యురాళ్లు నేహా, అఫ్ష, నవనీత, ఝాన్సీ, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్ఓసి అందజేసిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్

నవతెలంగాణ-మద్నూర్



ఎల్ఓసి అందజేస్తున్న ఎంపీ

మద్నూర్ ఉమ్మడి మండల పరిధిలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల కేంద్రానికి చెందిన సుశాంత్ పటేల్ అనే వ్యక్తికి బ్రెయిన్ ట్యూమర్ సమస్య రావడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం 7 లక్షల రూపాయలు ఖర్చు వస్తుందని వైద్యులు తెలుపడంతో ఆ కుటుంబానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్‌ను సంప్రదించగా ఎంపీ తక్షణమే స్పందించి సీఎం సహాయనిధి సహకారంతో బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.7లక్షల ఎల్ఓసిని ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది వివిధ ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సును మంగళవారం కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలపైన చెరువులో, బావులో ప్రమాదశాత్తు ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఎలా మనం కాపాడుకోవాలో, రక్షింపబడాలో అనే దానిపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత, అంగన్వాడీ టీచర్ సురేఖ, అగ్నిమాపక సిబ్బంది తూర్పు వెంకట్‌రాజు, ఎం.నవీన్, కె.నరేందర్, బి.శివ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



మొరం పోసి చదును చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ గ్రామ శివారులో వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొరంపోసి చదునుచేశారు. కొట్టుకుపోయిన రోడ్డుతో ఇబ్బందులపై నవతెలంగాణలో కథనం ప్రచురితమవడంతో అధికారుల స్పందించి మంగళవారం కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంట మనిషి ఎంపిక

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వంట మనిషి ఎంపిక త్రీ సభ్య కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రేమ్ షీలాను ఎంపిక చేసినట్టు పాఠశాల నిర్వాహకురాలు శ్యామల పేర్కొన్నారు. ఇటీవల తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు ఆధ్వర్యంలో విచారణ జరిపిన త్రీ సభ్య కమిటీ వంటల డెమో నిర్వహించి, అందులో నుంచి ఒకరిని ఎంపిక చేశారు.

ఆర్.బీ.ఎస్.కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్.బీ.ఎస్.కే ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శ్రీనివాస్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఏడుగురికి ఉచితంగా మందులు ఇచ్చారు. ఐదుగురిని బోధన్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దాసరి ధన్‌రాజ్, ఫార్మసిస్ట్ శ్వేత, ఏఎన్ఎం ఫాతిమా, ఉపాధ్యాయులు కస్తూరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

47వ వార్డులో అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ గెరిగంటి స్వప్న

నవతెలంగాణ-కామారెడ్డి

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 47వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి తడి చెత్త - పొడి చెత్త సేకరణ, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను మురికి కాల్వల్లో, రోడ్లపై వేయకుండా ఇంటి ఆవరణలో జమ అయ్యే చెత్తను తడి, పొడి డబ్బాలలో వేరు చేసి ఇంటి ముందరికి వచ్చే మున్సిపల్ ఆటోకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్విరాన్మెంట్ ఇంజనీర్ ముమీన్, మున్సిపల్ సిబ్బంది ప్రకాష్, మహబూబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచినీరు అందించాలి

- మిషన్ భగీరథ అధికారి వెంకటేశ్వర్ గౌడ్
- గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన మంచినీరు అందించి వారి మన్ననలు పొందాలని బాన్సువాడ మిషన్ భగీరథ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. చేతి పంపుల మరమ్మతు, గొట్టపు బావులకు అమర్చిన పంపుసెట్లు, పానెల్ బోర్డులు బాగు చేయడం, నీటిని సరఫరా చేసే పైపులైన్లకు, నల్లాలకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతు చేయడం, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించడంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చి సుశిక్షితులుగా తయారు చేస్తున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన సహాయకులు గ్రామాల్లో సురక్షితమైన మంచినీరు ప్రజలకు అందించి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, ఇతర అధికారులు నాగేశ్వర్‌రావు, దాసరి రమేష్, శ్రీనివాస్, సక్రం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారి వెంకటేశ్వర్ గౌడ్

అసత్య ప్రచారాల్ని ప్రజలు నమ్మొద్దు

- నిజాన్ని తెలుసుకుని రాయాలి
- ఎంతో కష్టపడి మెడిసిన్ చదివాం
- ప్రవేట్ ఆసుపత్రి డాక్టర్లు

నవతెలంగాణ-కామారెడ్డి

తాము ఎంతో కష్టపడి మెడిసిన్ చదివి ప్రజలకు సేవ చేసేందుకే ప్రజల్లోకి వచ్చామని పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 22న అపెక్స్ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది వైద్యం చేయించుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేసి, వేసిన కుట్లు తొలగించి కొట్టి బయటకు పంపించారని కొన్ని పత్రికల్లో రాశారని అందుకు తాము ఎంతో మానసిక వేదన గురి అయ్యామని ఆసుపత్రి డాక్టర్ నవీన్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఆ వార్తల్లో ఎంత మాత్రం నిజం లేదని, ఈనెల 22 న శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి అతని మిత్రులు ఎక్కువ మోతాదులో మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై నుండి పడి తీవ్ర రక్తస్రావం జరగగా, చికిత్స కొరకు తమ అపెక్స్ హాస్పిటల్‌కు వచ్చారని, దీంతో డ్యూటీ డాక్టర్‌తో వైద్య సదుపాయం కల్పించి, వారికి అంటిన మొత్తం రక్తాన్ని శుభ్రపరచి ప్రథమ చికిత్స అందించి కట్టు కట్టామని, కుట్లు వేసుకోవడానికి పేషెంట్ సహకరించకుండా డాక్టర్ని, నర్స్‌తో పాటు స్టాఫ్‌ను అసభ్యకరంగా ప్రవర్తించి, నానా బూతులు తిడుతూ, అసభ్య పదజాలం వాడుతూ హాస్పిటల్ నుండి బయటకు వెళ్లి మరొక హాస్పిటల్‌కి వెళ్లారని తెలిపారు. అక్కడ అలాగే అసభ్యకరంగా ప్రవర్తించడంతో హాస్పిటల్స్ సిబ్బంది బయటకు పంపించడంతో తిరిగి మరల అపెక్స్ హాస్పిటల్‌పైకి వచ్చి డోర్ మూసివేసి కుర్చీలను ఎత్తివేస్తూ హాస్పిటల్స్ సిబ్బందిని అసభ్యకరంగా తిడుతూ దాడి చేశారన్నారు. తాము శ్రీనివాస్ అనే పేషెంట్‌కు ఎలాంటి కుట్లు వేయలేదని, తీయలేదని డబ్బులకు కూడా ఎలాంటి ఇబ్బంది పెట్టలేదు అన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై, శ్రీనివాస్‌పై, అతని మిత్రులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమణ, జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ వెంకటేశ్వరగౌడ్, డాక్టర్ పుట్ట మల్లికార్జున్, డాక్టర్ వెంకట్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవేట్ ఆసుపత్రి డాక్టర్లు

ఓటర్ జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి

- తహసీల్దార్ ధాన్వాల్

నవతెలంగాణ-ఎడపల్లి

బూత్ లెవెల్ స్థాయి (బీఎల్వోలు) ఓటర్ జాబితా సవరణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ ధన్వల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బిఎల్వోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫామ్ 6లో నూతన ఓటర్లను నమోదు చేసుకోవచ్చున్నారు. ఫామ్ 7తో చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఫామ్ 8 దరఖాస్తు ఫారంలో ఎవరైనా చనిపోయిన వ్యక్తులు ఓటర్ జాబితాలో ఉంటే వారి పేర్లను తొలగించాలన్నారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఇతర గ్రామాలలో ఉంటే అక్కడ వారికి ఓటర్ కార్డు ఉందా లేదా ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకుని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఆయా గ్రామాల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ధాన్వాల్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- బహిరంగ సభకు తరలిన రేషన్ డీలర్లు

నవతెలంగాణ-బోధన్/మద్నూర్

పటాన్‌చెరులో నిర్వహిస్తున్న రేషన్ డీలర్ల మహాసభకు సాలూర, బోధన్ మండలాల నుంచి రేషన్ డీలర్లు మంగళవారం అధిక సంఖ్యలో వాహనాలలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాలూర మండల రేషన్ డీలర్ల అధ్యక్షులు బోర్రె శేఖర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్‌లో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో వచ్చిన తర్వాత రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారని అన్నారు. కావున రేషన్ డీలర్లకు కనీస వేతనం రూ.5000లు, క్వింటాకు రూ.300 కమీషన్ అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై హైదరాబాద్ పఠాన్ చెరులో జరిగే భారీ బహిరగసభకు తరలుతున్నట్లు తెలిపారు. ఈ సభకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హాజరవుతున్నట్లు తెలిపారు. పఠాన్‌చెరుకు తరలిన వారిలో మండల సెక్రటరీ రాహుల్, లక్మణ్, డిస్కో సాయిలు, రాజు పటేల్, సాలెన్ సంజీవ్, చిన్నపురెడ్డి, మల్లయ్య, ఉదయ్ తదితరులున్నారు.

మద్నూర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షులు రమేష్ దేశాయ్ ఆధ్వర్యంలో మంగళవారం పటాన్ చెరులో చేపట్టిన బహిరంగ సభకు మండలంలోని రేషన్ డీలర్లు తరలివెళ్లారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్ డీలర్లకు రూ.5 వేల వేతనం పెంచాలని, రూ.300 కమీషన్ ఇవ్వాలని ఈ సందర్భంగా రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు.



మద్నూర్ : పటాన్‌చెరు తరలివెళ్తున్న డీలర్లు

గర్గుల్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఖోఖో సెలక్షన్స్



ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జోన్ స్థాయి ఖోఖో సెలక్షన్స్ అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్, ఖోఖో సెలక్షన్స్‌ను జడ్పీహెచ్ఎస్ గర్గుల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి అయిన వై.ఎల్లయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ముగింపు కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బ్రహ్మం, సెలక్షన్ ఇంచార్జ్ గర్గుల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి, లక్ష్మన్, బబాగౌడ్, నవీన్, స్వామి, హరీష్, తదితర వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ పోటీలో ఎంపికైన క్రీడాకారులు రేపటినుంచి సాయంత్రం 4 గంటలకు ఫ్రోబెల్స్ హైస్కూల్లో కోచింగ్ క్యాంపు ఉంటుందని, 4గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. క్యాంపులో పెర్ఫార్మెన్స్ బట్టి జిల్లా స్థాయిలో పార్టిసిపేషన్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు కోచింగ్ క్యాంపునకు హాజరుకావాలని క్రీడాకారులకు ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి సూచించారు.

మహమ్మదాపూర్‌ను సందర్శించిన ప్రత్యేకాధికారి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్

నవతెలంగాణ-బీబీపేట్

బీబీపేట్ మండలంలోని మహమ్మదాపూర్ గ్రామాన్ని మండల పరిషత్ ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్ మంగళవారం సందర్శించారు. ఈ క్రమంలో ఆయన గ్రామంలోని పరిశుభ్రత, తాగునీరు, మురికి కాలువలు శుభ్రపరచడాన్ని పరిశీలించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారంపై అంగన్వాడి టీచర్ల ఆయాల సూచనలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా గ్రామంలోని గృహాలలో నీటిని నిల్వ ఉంచకుండా నీటిని ఒకవేళ నిలువ ఉంచితే దోమలు ఏ విధంగా తయారవుతాయో ఆయన వివరించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ఏ విధంగానో సూచించారు. వాటి వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. అంతేకాకుండా గ్రామంలోని డ్వాక్రా మహిళలను కలిసి ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఆయన వివరించారు. గ్రామంలో నీటిని ఎలా నిలువ ఉంచాలో, తద్వారా భూగర్భ జలాలను ఏ విధంగా కాపాడుకోవచ్చునో ఆయన వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో బంతి, పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీఓ కృష్ణ, గ్రామ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు ఆరోగ్యం

- వీరన్నగుట్ట గ్రామంలో పోషణ మాసోత్సవాలు

నవతెలంగాణ-రెంజల్

గర్భిణీ బాలింత మహిళలు పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీలరాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీ బాలింత మహిళలు ఆకుకూరలు కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని, వాటి వల్ల తల్లికి బిడ్డకు ఆరోగ్యం ఉంటుందని వివరించారు. పోషణ మహోత్సవాస్తవంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలను చేపట్టారు. పోషకాహారంపై గర్భిణీ బాలింత మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు తమ ఇంటి పరిసర ప్రాంతాలలో ఆకుకూరలు కాయగూరలు పెంచాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, బి.శాంత, శాంత, ఆశావర్కర్లు కవిత, స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయురాలు, ఎస్ఎల్ఎంసి కమిటీ సభ్యులు, గర్భిణి బాలింత మహిళలు, అంగన్వాడీ చిన్నారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

- మండల స్పెషల్ అధికారి అనిల్ కుమార్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతలో ముందంజలో నిలిపేందుకు ప్రజలు సహకరించాలని, స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని బీర్కూర్ మండల ప్రత్యేక అధికారి, డివిజన్ వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ సూచించారు. మంగళవారం బీర్కూర్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్లను, తాగునీటి ట్యాంకులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అక్టోబర్ రెండవ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న అపరిశుభ్రత తొలగించనున్నట్టు వివరించారు. నేడు అధికారులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి మురికి కాలువలను శుభ్రం చేయడం, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. గ్రామంలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమం సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నిర్వహించే పనులను సకాలంలో చేపట్టాలని అధికారులకు సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో అపరిశుభ్రత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ ఎంపీఓ మహబూబ్, గ్రామ కార్యదర్శి దివ్య, ఆరోగ్య కార్యకర్త గంగామణి, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ముఖ్తార్ పాషన్న పైల చంద్రక్కకు నివాళి



నివాళ్లు అర్పిస్తున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు

నవతెలంగాణ-బోధన్

భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ముఖ్తార్ పాషన్న, శ్రీకాకుళం సాయుధ పోరాట నాయకురాలు కామ్రేడ్ పైల చంద్రక్క 4వ వర్ధంతి సందర్భంగా బోధన్ పట్టణంలో మంగళవారం ఇఫ్టు ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇఫ్టు జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడుతూ కామ్రేడ్ ముఖ్తర్ పాష మరణం భారత కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. విద్యార్థి ప్రాయం నుంచే ఉద్యమ బాటలో నడిచాడని, తన అమూల్యమైన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్మికవర్గ రాజ్యం కోసం పోరాడడమే కామ్రేడ్ పాషన్నకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కామ్రేడ్ పైల చంద్రక్క జీవితం పోరాటలకే అంకితం అయిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి సాగిన శ్రీకాకుళ సాయుధ పోరాటంలో పైల చంద్రక్క అగ్రభాగాన నిలిచిందన్నారు. ఎన్నో చిత్ర హింసలు, నిర్బంధాలను అధిగమించి విప్లవోద్యమంలో చివరి వరకు నిలబడిందని మహిళ లోకానికి ఆమె ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. విప్లవోద్యమం కోసం అంకితమై పని చేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బోధన్ ఏరియా కార్యదర్శి సురేష్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు శ్రావణ్, రాజశేఖర్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, జగదీష్, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి



నవతెలంగాణ-బోధన్

విద్యార్థుల ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని మండల విద్యాధికారి నాగనాథ్ అన్నారు. మంగళవారం బోధన్ ఉప విద్యాధికారి కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్, సాలూర మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను సక్రమంగా నమోదు చేసి అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల గుర్తింపు కోసం 21 అంశాల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నిజాం ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ ట్రైనర్స్ మహేష్ కుమార్, వెంకటరమణ ద్వారా ఆరోగ్య విద్య ఫిజియోథెరపీపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. మండల నోడల్ అధికారి నాగయ్య కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, రత్నాకర్, జ్యోతి, రిసోర్స్ పర్సన్ రాకేష్, హనుమండ్లు, సిఆర్పిలు విజయ్, యూసుఫ్, బాబు, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

వారసులకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలి

- **తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి**

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81, 85 ప్రకారం 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన విఆర్‌ఏల వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని తహసిల్దార్ రవీందర్ రావుకి మంగళవారం వినతి పత్రం అందజేశారు. గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య (వారసత్వ) నియామకాల కోసం జీవో యమ్ ఎస్ నెంబర్ 81,85 ప్రకారం 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకంకోసం జీవోలు జారీ చేసిందన్నారు. జీవో వచ్చినప్పటినుండి 265 మంది మరణించారని అలాగే 25 మంది వారసులు కూడా మరణించారని అన్నారు. వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇప్పించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

మహిళ ప్రాణాలు కాపాడిన ఎస్సారెస్పీ సిబ్బంది

నవతెలంగాణ-మెండోర



నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం గోవూరు గ్రామానికి చెందిన ఎరుకల.పద్మ సోమవారం పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టులో పడి ఆత్మహత్య చేసుకోవడానికి రావడంతో ఆమెను ఎస్సారెస్పీ సిబ్బంది కాపాడారు. సోమవారం రాత్రి సమయంలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు లో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మహిళ ను అక్కడే విధులు నిర్వహిస్తున్న ప్రాజెక్టు సిబ్బంది గమనించారు. ప్రాజెక్టు అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆమెను పోలీసులకు అప్పగించారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మహిళ దగ్గర ఆమె పేరు గ్రామం వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబీకులకు సమాచారం అందించి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు.

స్పెషలైజేషన్‌లలో ప్రావీణ్యం సంపాదించాలని

- **రిజిస్ట్రార్ ఎం. యాదగిరి**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ మేనేజ్మెంట్ విభాగంలో ఎంబిఎ కోర్స్‌లో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఎం. యాదగిరి పాల్గొని మాట్లాడుతూ బిజినెస్ మేనేజ్మెంట్ లో స్పెషలైజేషన్ ల ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యం లో విద్యార్థులు నైపుణ్యాలు నేర్చుకోవాలని వివిధ స్పెషలైజేషన్‌లలో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సెమినార్ డైరెక్టర్, విభాగాధిపతి సిహెచ్. ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు స్పెషలైజేషన్ ఎంపికలో పద్ధతులను వివరించారు. ప్రిన్సిపల్ సి హెచ్ ఆరతి మాట్లాడుతూ ఎంబిఏలో స్పెషలైజేషన్ గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని గౌతమి, నిషిత , ఇతర ఎంబిఏ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రొఫెసర్ కైసర్ మొహమ్మద్, డీన్ అపర్ణ, రాజేశ్వరి, వాణి , విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ , ప్రొఫెసర్ రాంబాబు, రవీందర్ రెడ్డి , ప్రొఫెసర్ సంపత్ కుమార్ , డాక్టర్. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

50 వసంతాల సభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యూ)50 ఏళ్ల స్వర్ణోత్సవ సభల పోస్టర్లను మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ లోని పరిపాలనా భవనం వద్ద ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా ప్రొఫెసర్ ఏ.పున్నయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచే బలమైన పాత్రను పిడిఎస్‌యునిర్వహించిందన్నారు. మతోన్మాదం సామ్రాజ్యవాదం పెనవేసుకుని దేశాన్ని, దేశ ప్రజలను సంక్షోభంలోకి నేడుతున్న సందర్భంలో మరింత చారిత్రక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసిందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలంగా పోరాడిందన్నారు. ఈనెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని విద్యార్థులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, కోశాధికారి నిఖిల్, నాయకులు మహిపాల్, శివకుమార్, రాజేశ్వర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ భవన నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించండి

- **ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ఘనపూర్ ఆదివాసీల వినతి**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆదివాసీ నాయపోడ్ కుల సంఘా సభ్యులు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.మండల కేంద్ర లోని ఘనపూర్ లో ఆదివాసీ నాయకపోడ్ కుల సంఘ భవన నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు కేటాయించాలని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సిడిపి నిధులు రాగానే సంఘ భవనం కోసం నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కల్యాణ మండపంలో వంటశాల, బాత్ రూమ్స్ కేటాయించాలని, డిగ్రీ కాలేజీ కోసం భూమి కేటాయించలని, తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల భూమి ఇచ్చి ఇల్లు కట్టించాలని విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పోలసాని శ్రీనివాస్, డాక్టర్ షాదుల్ల, రామకృష్ణ, డాక్టర్ లింభద్రి, హరీష్ పటేల్, బాజేందర్, దేవేందర్, నాయకపోడ్ మండల నాయకులు గంగాధర్, శేఖర్, మోహన్, సాయిలు, బాలయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం నాడు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే సీఎం సహాయ నిధి నుండి గాని ఎల్‌వోసి గాని లేదా బిల్లులో రాయితీ గాని ఇప్పించే బాధ్యత తీసుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్వ సమాజ అధ్యక్షులు ఆకుల రాజు, కలిగోట్ గంగాధర్,జెస్సు అనిల్, యామాద్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-మెండోర

పోగొట్టుకున్న సెల్ ఫోన్ బాధితురాలు వేముల.సరితకు ఎస్ఐ నారాయణ అందించారు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొబైల్ ట్రేస్ చేసి ఫోన్ ను గుర్తించారు. ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలని, తద్వారా ఫోన్‌ను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పివిఆర్ భవన్ జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డికి మంగళవారం ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసి శాలువా పూలమాల, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. నియోజక వర్గ అభివృదికి కృషి చేయాలని కోరారు. కార్యక్రంలో రోటరీ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డిజే దయానంద్, బేల్దారీ శ్రీనివాస్, బొచ్కర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గంజ్ ఏరియాలో శ్రమదానం నిర్వహించారు. వర్కర్లతోపాటు, గంజిలో వ్యాపారం చేస్తున్న టిబెటన్ పౌరులు శ్రమదానంలో పాల్గొన్నారు. డివిజన్ నంబర్ 8లో స్వచ్ఛదనం లో భాగంగా పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేశారు. 24వ డివిజన్లో కార్పొరేటర్ తో పాటు ఆశ వర్కర్లు, నిజామాబాద్ మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, కలిసి సీగ్రిగేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నెంబర్ 24, రోడ్లు, పరిసరాలను, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సునీల్, జవాన్లు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ జోన్ కార్యాలయంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ నేతృత్వంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు.

అశాస్త్రీయమైన రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలి

- **ఎస్‌టియు**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఆశాస్త్రీయమైన రేషనలైజేషన్ నిబంధనలను మార్చాలని ఎస్టియు నాయకులు పేర్కొన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు లో భాగంగా మంగళవారం పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతుంటే ప్రభుత్వం అశాస్త్రీయమైన రేషనలైజేషన్ ఉత్తర్వులను అమలు చేయాలని పిల్లల సంఖ్యాపరంగా ఉపాధ్యాయులను నియమించాలని ఉత్తర్వులు ఇవ్వడం అసంబద్ధమని, దానిని వెంటనే ఉప సంహరించు కోవాలనిఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.ఎస్ ధర్మెంధర్, చీమల శ్రీకాంత్ అన్నారు. 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడం అశాస్త్రీయమని, ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంతో సంబంధం లేకుండా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్ట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయి రిలీవ్ కానీ టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని, తర్వాతే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఖాళీలను సత్వరం విద్యా వాలంటీర్లతో భర్తీ చేయాలని డీఎస్సీ నియామకంతో పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్ డిఎలను విడుదల చేయాలని, పిఆర్‌సిని 51శాతం ఫిట్మెంట్‌తో ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వాసు, జిల్లా ఉపాధ్యక్షులు గంగా కిషన్,జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నాకర్, బున్ని గంగాధర్, శ్రవణ్, పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే

నవతెలంగాణ- ఆర్మూర్



పాల్గొన్న, అధ్యాపకులు విద్యార్థులు

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామ్ కింకర్ పాండే మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కేంద్ర ప్రభుత్వ సంస్థని ఇది చాలా ఉన్నత ఆశయాలతో ఏర్పాటు చేశారని, దేశ సమగ్రత దేశ ఐక్యత దేశభక్తి సౌభాతృత్వం పెంపొందించేందుకు 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ స్థాపించారని తెలిపారు. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల సెక్రెటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ కరువు కాటకాలు, వరదలు, భూకంపాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేసిన కృషి అమోఘమని అన్నారు. డాక్టర్ ఎం సుధాకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు కలుగుతాయని, సమాజాన్ని మరింత అర్థం చేసుకొని అభ్యున్నతికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ హితమే సత్యశోధక్ సమాజ్ లక్ష్యం

సత్యశోధక్ ఎడ్యుకేషనల్ చైర్మన్ నర్సయ్య

నవతెలంగాణ-సిరికొండ

సమాజ హితమే లక్ష్యంగా ఆవిర్భవించిన సంస్థ సత్యశోధక్ సమాజ్ అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ చైర్మన్ ఆర్. నర్సయ్య అన్నారు. సంఘ సంస్కర్త, సామాజిక విప్లవోద్యమ పితామహుడు, మహాత్మా జ్యోతిరావ్ పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ 151వ ఆవిర్భావ దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు ముందుగా ఆర్.నర్సయ్య మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రి బాయి పూలే చిత్ర పటాలకు పూల మాలవేసి చి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వేళ్లూనుకుపోయిన అవిద్య, అంటరానితనం, అస్పృశ్యత, వెట్టిచాకిరి, బానిసత్వం, కుల మత లింగ వివక్షత లాంటి సామాజిక రుగ్మతలతో కొట్టుమిట్టాడుతున్న ఆనాటి కాలంలో ఆధునికత, విద్యాభివృద్ధితో సమూల మార్పులు తీసుకురావడానికి 1873న పూణేలో మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించన ఒక సామాజిక సంస్కరణ సంఘమని అన్నారు. పూలే, సత్యశోధక్ సమాజ్ ఆశయాల సాధనకు పాటుపడదామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం

- **ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానమని, రేపటి బావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో వారి కృషి అమోఘమని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి భాస్కరా ఫార్మసీ వ్యవస్థాపకులు భాస్కర్ యాదవ్ సహకారం అందించారు. మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, భాస్కరా ఫార్మసీ వ్యవస్థాపకులు భాస్కర్ యాదవ్ మండల ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. అంతకుముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సన్మాన గ్రహీతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బాట్మెంటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-మోర్తాడ్



మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థిని రితిక రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 43వ జాతీయ స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పిఈటి సింధుజ మంగళవారం తెలిపారు. ఈనెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రితిక పాల్గొంటు న్నట్లు చెప్పారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పీఆర్టీయూ కార్యవర్గానికి ఘన సన్మానం

నవతెలంగాణ-దర్పల్లి

మండలంలోని దుబ్బాక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం మండల పీఆర్టీయూ కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఇటీవల జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నికైన అంకం నరేష్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గౌడ్ ను సన్మానించినట్లు మండల అధ్యక్షుడు వెంకట్ రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శశికళ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

నవతెలంగాణ-మెండోర

ఇటీవల వేల్పూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన సందర్భంగా మెండోర తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కొత్తింటి ముత్యం రెడ్డిని ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ సంతోష్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాటి సేవలు అందరికీ ఆదర్శం

- **ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

నవతెలంగాణ-ఆర్మూర్



రక్తదానం చేస్తున్న యువకులు

కోటపాటి సేవలు అందరికీ ఆదర్శం అని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. రైతు నాయకుడు, గల్ఫ్ కార్మిక నాయకుడు కోటపాటి పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పట్టణంలో మామిడిపల్లి లోని ఫంక్షన్ హాల్ లో పుట్టినరోజును మంగళవారం నిర్వహించారు. తన రాజకీయ గురువు లోక భూపతిరెడ్డి దంపతుల ఆశీర్వాదం తీసుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి మాట్లాడుతూ కోటపాటి చేస్తున్న సేవలను తోడుగా యువకులను సమీకరించి" రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడమే కాక సామాజిక సేవ చేయాలని ఆలోచన ఇక్కడి నుండే ప్రారంభం అవుతుందన్నారు. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. నరసింహం నాయుడు చిన్నప్పటినుండి సేవా మార్గాన్ని ఎంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరేందర్, బాలయ్య, గణేష్, నాగరాజ్, జి జి రాం,, ఎల్ఐసి, భాస్కర్, రమేష్, అంకరి గారి శంకర్, రుక్మాజి, బద్దం లింగారెడ్డి, గోవింద్‌పేట్ ఆనంద్ పాల్గొన్నారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. " ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ" వారు రక్త సేకరించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భూస అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి పొలంబాట

- **నిజామాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్**

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రైతుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఇందులో వంగిన పోల్స్ లను, లూస్ లైన్ లను సరిచేస్తున్నామని, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని, తీగల మధ్య అవసరం ఉన్న చోట స్పేసర్స్ పెడుతున్నామని నిజామాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. మోటార్లకు పెట్టుకున్న ఆటో స్టార్టర్లను తొలగించాలని, వాటివల్ల నీరు వృథా అవుతుందని అన్నారు. మెరుగైన సరఫరా అందించడానికి వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల లోవోల్టేజి సమస్య ఉండదని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే రైతులు వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు సమాచారం వెబ్ అప్లికేషన్ ద్వారా సంబంధిత అధికారి మొబైల్ యాప్ కి వెళ్తుందని అన్నారు. సదరు అధికారి ఆ ట్రాన్స్ఫార్మర్ ను చెక్ చేసి ఫెయిల్ అయ్యిందని నిర్ధారించుకొని వెంటనే యాప్ లో నమోదుచేస్తే ఆ తర్వాత ఎస్‌పీఎం షెడ్ అధికారి మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కరెంటు మోటార్లను కాని, పైపులను కాని, ఫుట్ వాల్వులను కాని తాకకూడదని, వ్యవ సాయ పంపుసెట్లు, స్టార్టర్లకు విధిగా ఎర్త్ చేయాలని అన్నారు. స్వయంగా కరెంట్ పనులను చేసుకొని ప్రాణాలు కోల్పుతున్నారని, విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించి పనులను చేసుకోవాలని కోరారు.

ముక్తార్ పాషకు నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాష నాలుగవ వర్ధంతి మంగళవారం నాగారంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ మాట్లాడుతూ కామ్రేడ్ ముక్తపాష కార్మిక సంఘాలను నిర్మించి కార్మిక పక్షాన పోరాటాలు చేసిన వ్యక్తిని అన్నారు. కార్మిక వర్గ రాజ్యం కోసం పోరాడడమే కామ్రేడ్ పాషన్నకు అర్పించి నిజమైన నివాళి అని అన్నారు కార్యక్రమంలో శివ కుమార్, అబ్బయ్య, నవీన్, దుర్గ పాల్గొన్నారు.

26న ఎస్జీఎఫ్ యోగా ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్జీఎఫ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల యోగా ఎంపికలు అండర్-14, 17 బాలురు, బాలికలు కోసం నిర్వహించ బడతున్నాయని ఎస్జీఎఫ్ పిడి ఎం. నాగమణి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. కామారెడ్డిలోని ఎస్పీ కార్యాలయం దగ్గర, యోగా భవన్‌లో ఈనెల 26 న ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 14ఏండ్లలోపు 01-01-2011 తర్వాత జన్మించిన వారు, 17 సంవత్సరాల లోపు బాలురు, బాలికలు 01-01-2008 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. విద్యార్థులు బోనాఫైడ్ సర్టిఫికేట్ తెచ్చుకోవాల్సి ఉంటుంద, మరింత సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 9347216426 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ హాస్టళ్లలోని సమస్యల్ని పరిష్కరించాలి

- **యూఎస్ఎఫ్ఐ**

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్లో సమస్యల్ని పరిష్కరించాలని ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ..ఎస్సీ హాస్టల్స్ నందు కనీసం మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. కొన్ని అద్దె భవనాల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. న్యాల్కల్ ఎస్సీ బీ స్కూల్ హాస్టల్‌లో డ్రైనేజీ సమస్య వల్ల మురికి నీరు నిలిచి దుర్వాసన, దోమలు బెడద ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు శివ, వేణు, నగర సహాయ కార్యదర్శిలు ఆశీర్వాదం, మారుతీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సొసైటీ సొమ్ము వాడుకుని రైతులను ముంచుతున్నారు'

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ సమావేశం మంగళవారం నిర్వహించారు. సొసైటీ సిబ్బంది అనామత్‌కింద లక్షల రూపాయలు తీసుకోవడం ఏంటని, పెద్దవాల్గోట్ వ్యవసాయ సహకార సంఘం ప్రారంభోత్సవానికి లక్ష 56వేలు, ఇతరముల కింద లక్షా 36వేలు ఖర్చు చేయడమేంటని రైతు దేగాం సాయన్న ప్రశ్నించారు. సొసైటీ సొమ్మును తమ వ్యక్తిగతానికి వినియోగించుకుంటూ రైతులను నట్టేట ఉంచతున్నారని ఆరోపించారు. రైతులు తీసుకున్న రుణాన్ని, వివరాలను సకాలంలో ఆన్లైన్లో చేయక రైతులు నష్టపోయారని, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని ఆగ్రహించారు. రైతులు కట్టిన సభ్యత్వం డబ్బులు సొసైటీ సిబ్బంది కుమ్మక్కయి కాజేశారని ఆరోపించారు. వాడుకున్న డబ్బులను కట్టించి రైతులకు న్యాయం జరిపించాలని కోరారు. 133 మంది రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. అవినీతికి పాల్పడుతున్న సొసైటీ సిబ్బందిని తొలగించి కొత్త పాలకవర్గాని నియమించాలని డిమాండ్ చేశారు. సొసైటీని అభివృద్ధి చేయని పాలకవర్గం ఎందుకని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెల్లెం గంగాధర్, వైస్ చైర్మన్ సాయిరి నర్సయ్య, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేసిన కౌన్సిలర్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం స్థానిక కౌన్సిలర్ కోనపత్రి కవిత కాశీరాం ఐదువేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆటల పోటీలలో పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొని గెలుపొందడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

- **జిల్లా కన్వీనర్, న్యాయవాది గటాడి ఆనంద్**

నవతెలంగాణ-ఆర్మూర్

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం, రామబాణం అని సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ న్యాయవాది గటాడి ఆనంద్ అన్నారు.-పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల లో సమాచార హక్కు చట్టంపై మంగళవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో తమకు కావలసిన సమాచారం తెలుసుకునే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. అన్ని విషయాలు ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. అడిగిన సమాచారం 30 రోజుల్లో ఇవ్వకపోతే పైఅధికారికి అప్పీలు చేయాలన్నారు అధికారి తప్పుడు సమాచారం ఇచ్చిన అసంపూర్తి సమాచారం ఇచ్చిన రాష్ట్ర కమిషన్ రోజుకు 250 నుండి 25000 వేల వరకు జరిమానా విధించే ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి రాగలత ,వైస్ ప్రిన్సిపల్ స్పందన, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న జి.బిందు, ఎల్.వైష్ణవి జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికవడంతో అక్టోబర్ 4వ తేదీన జమ్మూకాశ్మీర్‌లో జరిగే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి మౌర్య, ఉపాధ్యాయులు, విడిసి అధ్యక్షులు లక్కాకుల నరసింహులు, ఉపాధ్యక్షులు మంగలి రాజు, కార్యదర్శి బద్ది సతీష్, కోశాధికారి కండక్టర్ లింగం, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను సన్మానిస్తున్న పలువురు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఘన సన్మానం చేశారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మరోతి, రాజశ్రీ, చంద్రశేఖర్, చందర్, రాజు, బన్సీరామ్, శోభారాణి, రాజేందర్, నాగేశ్వర్‌రావుకు ఘనంగా వీడ్కోలు పలికారు. దీంతో పాటు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, నోడల్ అధికారి మల్లేశం, పిఆర్టీయూ నాయకులు శివరాం, భీమ్, మరోతి, ఉపాధ్యాయులు బస్వంత్, విద్యార్థులున్నారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

అంగన్‌వాడీల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-నిజాంసాగర్

అంగన్‌వాడీల్లో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో పోషణ మాసం నిర్వహిస్తుంటారని ఆయన అన్నారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి ఆయన అవగాహన కల్పించారు. పోషకాహార లోపాలను అధిగమించడానికి అంగన్వాడీ వర్కర్లు మహిళలలో అవగాహన కల్పించే విధంగా కృషిచేయాలని ఆయన కోరారు. అంగన్వాడీ సెంటర్లలో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయలపై నా దృష్టికి వచ్చిందని.. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సీడిపిఓ ఎఫ్ఎసి సౌభాగ్య మాట్లాడుతూ.. పోషణ్ అభియాన్ మార్చ్ 8 2018న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఆమె అన్నారు. పోషన్ అభియాన్ యుక్త వయసులో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, 0-6 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల పోషకాహార స్థితిపై దృష్టి పెట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత, బరువు పెరిగేలా ఈ పథకం కృషి చేస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉమ్మడి మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి జయ ప్రదీప్, ప్రజాపండరి, యూత్ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, మెడికల్ ఆఫీసర్ రోహిత్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పోచారంను సన్మానించిన నూతన ఏఎంసీ చైర్మన్

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి మండల మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ బాబా, మాజీ సర్పంచ్ నాగమణి విరాజ్ వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని తన నివాసంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ చైర్మన్ సురేష్ బాబాను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం

ఐకెపి ఆధ్వర్యంలో 18వ వార్షిక మహాసభ సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న ఐకెపి కార్యాలయ ఆధ్వర్యంలో మంగళవారం మండల సమైక్య 18వ వార్షిక మహాసభను రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో వార్షిక నివేదికను చదివి వినిపించి ఆమోదించారు. మండల సమైక్య రాబోయే సంవత్సరానికి ప్రణాళికను చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఐబీ డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమాల గురించి వివరిస్తూ దేశంలోనే వాటాదనంపై డివిజన్ ఇచ్చే మండల సమైక్య రెండు ఉన్నాయని ఇందులో భిక్కనూర్ మండల సమైక్య ఒకటి కావడం గర్వకారణం అని తెలిపారు. రానున్న రోజుల్లో మండల సమైక్య మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, సీసీలు, 55 గ్రామ సంఘాల ప్రతినిధులు, మండల సమైక్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డను కాపాడిన 108 సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన కళ్యాణి ప్రసవం కోసం మంగళవారం పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. రక్త కణాలు తక్కువగా ఉన్న కారణంగా కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సమయానికి చేరుకున్న 108 అంబులెన్స్ గర్భిణీ స్త్రీని కామారెడ్డికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. సమయస్ఫూర్తితో స్పందించి తల్లి బిడ్డ ప్రాణాలు కాపాడిన 108 ఈఎంటి శ్రీనివాస్, పైలట్ బాల నరసింహులను కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

జంతుజాల సంరక్షణ విధాన రూపకల్పనపై జాతీయ సైన్స్ డే వేడుకలు

నవతెలంగాణ-భిక్కనూర్

డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సంయుక్తంగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిధిలోని భిక్కనూర్ మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని ఆర్గనైజింగ్ సెక్రటరీ, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీల తెలిపారు. ఈ సదస్సుకు వైస్ ఛాన్సలర్ శ్రీ సందీప్ కుమార్, సుల్తానీయా (ఐఏఎస్) ముఖ్యఅతిథిగా, రిజిస్టర్ ఆచార్య ఎం యాదగిరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సుధాకర్‌గౌడ్ అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సదస్సులో కీలక ఉపన్యాసం చేయడానికి జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డాక్టర్ కరుత పండి, డాక్టర్ సంధ్య అన్నమనేని ఉస్మానియా యూనివర్సిటీ, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు శ్రీ సోమేశ్ బెనర్జీ, శివశంకర్ చిన్న హాజరవుతారని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, ఫార్మాసూటికల్ విభాగాచార్యులు డా.మావూరపు సత్యనారాయణ, టీజీ కాస్ట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.చంద్రశేఖర్, పిఆర్ఓ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

ఫుడ్ ఫెస్టివల్‌తో భోజనంపై అవగాహన

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బడి అంటే చదవడం.. రాయడం.. మానసికోల్లాసానికి ఆటలు ఆడుకోవడంతో పాటు వంటలపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనంపై అవగాహన కలుగుతుందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కుప్పిశెట్టి కిరణ్మయి తెలిపారు. బాన్సువాడలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తీసుకొచ్చిన వివిధ రకాల వంటకాలు నోరూరించాయి. చిన్నారులు తెచ్చిన వంటకాలను సబ్ కలెక్టర్ రుచి చూసి అభినందించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారులకు, తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇంట్లో అమ్మకు వంట చేయడంలో సహాయ పడటానికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయులు పద్మ, రేఖ, వీణ, సునీత, లలిత, సుష్మ సవిత తదితరులు పాల్గొన్నారు.


ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శిస్తున్న సబ్ కలెక్టర్

మురికి నీరు నిల్వ ఉండొద్దు

- బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణలో పారిశుధ్య పనులను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే దోమలు పెరుగుదలను కొంతవరకు తగ్గించుకోవచ్చునని అన్నారు. మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలపడంతో హాస్టల్ ఆవరణలో విద్యార్థులు ఉపయోగించిన నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంత ఏర్పాటు చేయడానికి జెసిబీతో ఇంకుడు గుంత తవ్వించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, హాస్టల్ వార్డెన్ శారద, 6వ వార్డు కౌన్సిలర్ బాలమణి పోచయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంత తవ్విస్తున్న ఆర్డీవో

నిధులు మంజూరు చేస్తా

ఎంపీ వరాలజల్లు


నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరుతున్న మైనార్టీ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని మైనార్టీ, బుడగ జంగం కాలనీవాసులకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ మంగళవారం మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంలో వరాల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా మండల మైనార్టీ నాయకులు తమ ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరడంతో స్పందించిన ఎంపీ సురేష్ షేట్కర్ తమ నిధులనుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాగా మండల బుడగ జంగం కాలనీవాసులు కమ్యూనిటీ భవన నిర్మాణం కోరడంతో వారికి సైతం తమ నిధుల నుంచి 10 లక్షలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిట్లం, కల్హేర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ, బుడగ జంగం కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళ్‌పహాడ్‌లో దేవి యూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో దేవి యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ యువకులు తెలిపారు. కమిటీ అధ్యక్షులుగా పోతుగంటి రవి, ఉపాధ్యక్షులుగా అరుగుల నాగరాజ్, కోశాధికారిగా చేపూర్ శ్రీనివాస్ గౌడ్, సలహాదారులుగా రాందాస్, విష్ణువర్ధన్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.


దుర్గాదేవి ప్రతిమ ఏర్పాటుకు భూమిపూజ

చదువుతోపాటు సేవ అలవర్చుకోవాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాలస్వామి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సామాజిక సమస్యలు తెలుస్తాయని తద్వారా సామాజిక సంబంధాలు మెరుగు అవుతాయని ఎస్ఆర్ఎన్కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల స్వామి తెలిపారు. మంగళవారం బాన్సువాడ ఎస్ఆర్ఎన్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీమ్ ఏకైక లక్ష్యం ఎలాంటి పక్షపాతాలు లేకుండా సమాజ సేవను అందించడంలో యువతకు శిక్షణ అనుభవాన్ని అందించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందజేసేందుకు పనిచేస్తారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాలలో శ్రమదానం, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని, గ్రామాలలో శ్రమదానంతో పాటు మూఢనమ్మకాలు, అంటురోగాలు, ఎయిడ్స్ నివారణ నివారణ గురించి గ్రామస్తులలో చైతన్యాన్ని తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2,3 విభాగాలకు చెందిన 200ల మంది వాలంటీర్లు పాల్గొన్నారని, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారులు యూనిట్ ప్రోగ్రాం అధికారులు పోతరాజు శ్రీనివాస్, డాక్టర్ రాజేష్, కోఆర్డినేటర్ వినయ్ కుమార్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వీడీసీ స్థల వివాదం సుఖాంతం

- 10 గుంటలు వీడీసీకి ఇచ్చిన కొనుగోలు చేసిన వ్యక్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన వీడీసీ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని గత కొంతకాలంగా వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీడీసీ స్థల భూమి కాగితాలు గ్రామపంచాయతీ నుంచి మాయమవడం స్థలాన్ని కబ్జా చేయడం గమనించిన వీడీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పోరాటానికి నేటితో ప్రతిఫలం దక్కింది. మంగళవారం అఖిలపక్ష నాయకులు, వీడీసీ సభ్యులు, కుల సంఘాలు, యువకుల ఆధ్వర్యంలో మొదటగా యూత్ క్లబ్ సమీపంలో చర్చలు జరిపి అందరూ కలిసి స్థలం వద్దకు వెళ్లారు. స్థలాన్ని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు స్థలం వద్దకు వచ్చి 10 గుంటల భూమిని వీడీసీ సభ్యులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేసిస్తానని ఒప్పంద పత్రాన్ని వ్రాత పూర్వకంగా రాసి ఇచ్చారు. అనంతరం వీడీసీ సభ్యులు 10 గుంటల స్థలంలో త్వరలోనే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం.

బాన్సువాడ పట్టణ సీఐగా అశోక్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణ సీఐగా అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడ టౌన్ సిఐగా విధులు నిర్వహించిన మున్నూరు కృష్ణ బదిలీ కావడంతో నిర్మల్ జిల్లా నుంచి అశోక్ బదిలీపై వచ్చారు. బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సీఐ అశోక్‌కు పోలీస్ స్టేషన్ సిబ్బంది పట్టణ ప్రముఖులు, ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుటుంబీకులను పరామర్శించిన ఎంపీ

నవతెలంగాణ-పిట్లం

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.బాల్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో మంగళవారం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ బాల్‌రెడ్డి తనకు మంచి మిత్రుడని తెలిపారు. నమ్మకం, విశ్వాసం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. గతంలో ఆయన మార్కెట్ చైర్మన్ పదవీ కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. పార్టీ కొరకు పరితపించేవారని అన్నారు. తాను గతంలో ఎంపీగా ఉన్న సమయంలో బాల్‌రెడ్డి పార్టీ, ప్రభుత్వ పథకాలపై నిరంతరం తనతో చర్చించేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా మా ఇద్దరికీ విడదీయరాని సంబంధముందని కలిసి ఉండేవారమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నల్లవాగు ప్రాజెక్టు మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జాంబీగే హన్మాండ్లు, శ్రీనివాస్‌రెడ్డి, సూరత్‌రెడ్డి, కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర తయారీ రంగ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామీణ ప్రాంతాలలో చేనేత వస్త్ర తయారీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర జౌళి శాఖ వీవింగ్ సొసైటీ డైరెక్టర్ పూగాలెంతి, మాజీ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆనంద్ భవన్‌లో కేంద్ర ప్రభుత్వ పథకం సమర్థ్ -హ్యాండ్‌లమ్ వీవింగ్‌లో భాగంగా గడి కోట ట్రస్ట్ సహకారంతో మహిళలకు చేనేత శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేనేత వస్త్ర తయారీ రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంతంలో మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా గతంలో దోమకొండలోని మహిళలకు 20 మంది శిక్షణ పొందారని, చేనేత శిక్షణ ట్రైనింగ్‌లో భాగంగా 45 రోజులు శిక్షణలో ఒక్కరికి రోజుకు రూ.300 అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వీవింగ్ సొసైటీ డైరెక్టర్లు పవన్, సంతోష్ కుమార్, టెక్నికల్ అడ్వైజర్ బాలాజీ, మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఐకెపి ఏపీఎం రాజు, దోమకొండ వీవింగ్ సొసైటీ చైర్మన్ బొమ్మెర లక్ష్మీనారాయణ, బీసు రవి, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, బత్తిని సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

బహిరంగ సభకు బయలుదేరిన రేషన్ డీలర్లు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు మంగళవారం హైదరాబాద్ సమీపంలోని రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల బహిరంగ సభకు బయలుదేరారు. రాష్ట్ర రాజధాని సమీపంలోని పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల బహిరంగ సభ మంగళవారం ఏర్పాటు చేశారు. బయలుదేరిన వారిలో ప్రభాకర్, నారగోడు కృష్ణమూర్తి, రాజులు, సాయన్న, శ్రీనివాస్, నర్సింలు, రమేష్, నహిం తదితరులు తరలివెళ్లారు.

సౌత్ క్యాంపస్‌లో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



మొక్కలు నాటుతున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్‌డే కార్యక్రమాన్ని డా.అంజయ్య, డా.హరిత, లక్కరాజు ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్ డా.సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకంలో విద్యార్థులు ప్రతి ఒక్కరూ వాలంటీర్‌గా నమోదు చేసుకుని అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలను అవగాహన చేసుకుని తద్వారా వాటికి పరిష్కారమార్గం చూపుతూ సమాజ అభివృద్ధికి, వ్యక్తిగత అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా క్యాంపస్‌లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.మోహన్ బాబు, డా.లలిత, డా.సబిత, డా.హరిత, డా.రమాదేవి, డా.సునీత, వైశాలి, డా.శ్రీమాత, డా.యాలాద్రి, డా.నారాయణ, డా.నర్సయ్య, దిలీప్, ఇతర అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవ వెలకట్టలేనిది

నవతెలంగాణ-రామారెడ్డి

సమాజంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవ వెలకట్టలేనిదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. మంగళవారం మండలంలోని గోకుల్ తండాలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు సక్కుబాయిని శాలువాలతో సన్మానించి, జ్ఞాపికతో పాటు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి, మాజీ ఎస్ఎంసి చైర్మన్ హరి చంద్, మాజీ సర్పంచ్ లలిత లింబాద్రి నాయక్, కారోబార్ గంగారం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ నాయక్, రవి నాయక్, పీరు సింగ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం